దరఖాస్తునకు నేడు ఆఖరు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రవేశ పరీక్ష ఆధారిత డిప్లొమో, పోస్టుగాడ్యుయేట్, డాక్టోరల్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను సమర్పించడానికి సోమవారం చివరి తేదీ. ప్రవేశ పరీక్షలను జూన్ 12,13,14 తేదీలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ (కంప్యూటర్‌సైన్స్, ఎంఎడ్, మాస్టర్ ఆఫ్ లా, బీటెక్ (కంప్యూటర్‌సైన్స్) ఎల్‌ఎల్‌బి, బీఎడ్, డీఎల్ఎడ్, పాలిటెక్నిక్ డిప్లొమోలలో ప్రవేశాలు అందిస్తారు. వివిధ పీహెచ్‌డీ కోర్సులకు కూడా దరఖాస్తులు కోరుతున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో చూసి దరఖాస్తును పూర్తి చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. మరిన్ని వివరాలకు 040-23006612 ఎక్స్‌టెన్షన్ 1801ను సంప్రదించాలి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



మంజూరు పత్రాలను అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: పేద ప్రజలు మెరుగైన వైద్యం పొందేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో నలుగురికి సీఎం రిలీఫ్‌ఫండ్ రూ. 2.25 లక్షల మంజూరుపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, కిరణ్, ప్రసాద్, విఘ్నేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



ప్రభుత్వ స్థలంలో పిల్లర్లను తొలగిస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించగా శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలంలో పిల్లర్లు వేస్తున్నారు. ఫిర్యాదు అందడంతో ఆర్ఐ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పిల్లర్లు, పునాదుల కోసం వేసిన కాంక్రీట్‌ను జేసీబీతో తొలగించారు. ఆ స్థలం విలువ కోటి రూపాయల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. కేశవ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్న స్థానికులు ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు

నిజాంపేట్: పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో బాచుపల్లి మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కార్మికులు బతికే పరిస్థితి నేడు లేదన్నారు. ఈ నెల 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను పాకిస్తాన్‌తో ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలిపారు. సమ్మెను జూలై 9న నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికుల పెండింగ్ బిల్లులు, జీతాలు వెంటనే చెల్లించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శిగా పాలబిందెల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదయ్య, శ్యామ్, బాలకృష్ణ, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తారమ్మ తల్లికి పూజలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సీతారామచంద్ర స్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు ఆదివారం చిత్తారమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాస్ నూతన కమిటీ సభ్యులకు స్వాగతం పలికి సన్మానించారు. అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాధవరం శ్రీనివాస్‌రావు, మేకల సుదర్శన్, తీగల కృష్ణారావు, శ్రీనివాస్‌రావు, రాజుయాదవ్, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, బాలరాజ్, రాము, కృష్ణవేణి, విద్యాకల్పన, నాగమణి పాల్గొన్నారు.

అప్రమత్తతే ముఖ్యం..

చదువుకున్న వారే సైబర్ బారిన పడుతున్నారు



- హాస్టళ్లలో దొంగతనాలు ఎక్కువ
- ప్రధాన కూడళ్లలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు



మాదాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌నాయక్

మాదాపూర్: సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. చదువుకున్న వారే ఎక్కువగా మోసపోతున్నారని మాదాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి.విజయ్‌నాయక్ తెలిపారు. సోషల్ మీడియా, ఫెడెక్స్ మోసాలు, రెంటల్, ఇన్వెస్ట్‌మెంట్, లోన్స్, బెట్టింగ్ యాప్, కస్టమర్ కేర్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల బారిన పడినపుడు సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఫోన్.1930కి.. ఇతర సమస్యలు ఎదురైతే 100కి డయల్ చేయాలని ఆయన తెలిపారు. ఈ నేరాలపై ప్రధాన కూడళ్లలో, కళాశాలల్లో, జన సమ్మర్ధం ఉన్నచోట వీటిపై అవగాహన కల్పిస్తున్నాం. మాదాపూర్ డిటెక్టివ్ టీంలో 10 మంది ఉన్నారు. సైబర్ క్రైంలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నవారు ఇద్దరున్నారు. నేరాలు పెరిగిపోతున్న తరుణంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు.

ప్రశ్న: మాదాపూర్ ప్రాంతంలో ఎలాంటి నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి?

ఇన్‌స్పెక్టర్: సైబర్ నేరాలతో పాటు ఎక్కువగా హాస్టళ్లలో దొంగతనాలు జరుగుతున్నాయి. సరైన భద్రత లేకపోవడం వల్ల రూంలలోకి చొరబడి ల్యాప్‌టాప్స్, ఫోన్స్, నగదుతో పాటు ఖరీదైన వస్తువులను దొంగిలిస్తున్నారు. 24 గంటల పాటు సెక్యూరిటీని నియమించాలి. హాస్టల్‌లో ఉన్న ప్రతి ఒక్కరికి ఐడీ కార్డు ఇవ్వాలి. లోపలికి వెళ్ళేవారు తప్పని సరిగా ఐడీ కార్డులను చూపాలనే నిబంధన ఉండాలి. అప్పుడే దొంగతనాలను అరికట్టవచ్చు.

ప్ర: ఫెడెక్స్ మోసం గురించి?

జ: గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీకు ఎయిర్ పోర్టు నుంచి పార్సిల్ వచ్చిందని అందులో డ్రగ్స్ ఉన్నాయని.. మీరు ఫలానా పోలీస్‌స్టేషన్‌కు రావాలని భయపెడతారు. కొంత సమయం తరువాత మీరు డబ్బు చెల్లిస్తే కేసు కొట్టివేస్తామని చెప్పి వారివద్ద నుంచి డబ్బు వసూలు చేసి ఫోన్‌లను స్విచ్చాఫ్ చేస్తారు. ఇలాంటి మోసాల బారిన విద్యావంతులేపడుతున్నారు. ఎవరికి వారు అప్రమత్తంగా ఉండాలి.

ప్ర: ట్రాన్స్‌జెండర్స్, సోషల్‌మీడియా ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి?

జ: ఖాళీ ప్రదేశాల వద్ద, ప్రధాన కూడళ్లలో ట్రాన్స్ జెండర్స్ ఎక్కువగా ఇబ్బందులు పెడుతున్నారు. వారి ప్రలోభాలకు లోనుకాకుండా ఉండాలి. వారి వద్ద ఆగవద్దు. ఏవైనా సమస్యలు వస్తే వెంటనే 100కి డయల్ చేయాలి. అమ్మాయి, అబ్బాయిలు కలిసి ఉన్నప్పుడు తీసుకున్న ఫొటోలు వారు విడిపోయిన తరువాత మార్ఫింగ్ చేసి డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. పర్సనల్ విషయాలు ఎవరితోనూ పంచుకోవద్దు.

ప్ర: బెట్టింగ్ యాప్‌ల ద్వారా జరుగుతున్న మోసాలు ఏమిటి..

జ: ప్రస్తుతం బెట్టింగ్‌కి అలవాటు పడ్డారంటే ప్రాణాలు కోల్పోవాల్సిందే. చిన్న చిన్న బెట్టింగ్‌లు కట్టినప్పుడు తిరిగి డబ్బును చెల్లించి ఆసక్తి కలిగిస్తారు. అలవాటు అయిన తరువాత పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టినప్పుడు పోతాయి. ఇలాంటి అలవాట్లతో బంధువుల వద్ద, స్నేహితుల వద్ద అప్పులు చేస్తుంటారు. నష్టపోయాక దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చెడు వ్యసనాలకు బానిసలై ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మాతృదేవోభవ..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం మాతృదేవోభవ నృత్య ప్రదర్శన సందర్శకులను అలరించింది. నృత్యకిన్నెర సంస్థ ద్వారా వాసవి చౌదరి సీతాదేవిగా, వకుళమాతగా లవకుశలుగా బేబి హిత్రైశి, బేబి నిత్యలు నటించారు. మద్దాలి ఉష గాయత్రి శిష్యబృందం మాతృదేవోభవ కూచిపూడి నృత్యప్రదర్శనలో కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగంలో మాతృమూర్తులు పార్వతీదేవి, లీలావతి, సీతాదేవి, యశోదమాత, వకుళాదేవిల మాతృప్రేమని కన్నులకు కట్టినట్టు చూపారు.



వార్డు, ఏరియా కమిటీల ఏర్పాటు హుళక్కేనా..?



రాయదుర్గంలో గచ్చిబౌలి వార్డు కమిటీ కార్యాలయం (ఫైల్)

రాయదుర్గం: వార్డు, ఏరియా కమిటీల ఏర్పాటు కలగానే మిగిలింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సందర్భంగా వార్డు, ఏరియా కమిటీలను మరింత పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, ఎక్కువ మందికి అవకాశాలు కల్పించి వీటిని మరింత పటిష్టం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అందరిలో ఆశలు రేకెత్తాయి. డివిజన్ స్థాయిలో అధికార యంత్రాంగాన్ని నియమించి గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కానీ జీహెచ్‌ఎంసీ పాలక మండలి ఏర్పడి నాలుగేళ్లు పైబడినా కమిటీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో డివిజన్‌లోని అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు తమకు పదవులు ఉండవా....? అని మదనపడుతున్నారు. ఇప్పటికైనా వార్డు, ఏరియా కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- గతంలో గచ్చిబౌలి డివిజన్‌లో వార్డు, ఏరియా కమిటీలలో 11 మంది వార్డు, 9 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉండేవారు.
- నెలకోమారు నిర్వహించాల్సిన సమావేశాలు జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మూడు నెలలకోమారు, ఆ తర్వాత ఏడాదిలో మొక్కుబడిగా నిర్వహించి వదిలేశారు.
- నాలుగేళ్ళుగా ఈ వార్డు కమిటీలు లేకపోవడంతో ఇక సమావేశాలే లేకుండా పోయాయి.
- గత పాలకమండలి పదవీకాలం ముగియడంతో వీరి పదవీ కాలం కూడా ముగిసినట్లయింది.ఆ తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో అగమ్యగోచరంగా తయారైంది.

ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్:: మియాపూర్ కృషినగర్ కాలనీలోని గౌతమీ విద్యాక్షేత్ర పాఠశాలలో మహిళా ఆరోగ్య వికాస్ తరంగిణి వింగ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హాజరై ప్రారంభించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రతిరోజు యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వింగ్ సభ్యులు కె. విమలాదేవి, ప్రవీణ, మోహినీ, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాపిరెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, సురేష్ కుమార్‌రెడ్డి, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ: రీచ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2 కమిటీ హాల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, డా. రామకృష్ణారెడ్డి, డా.సృజనారెడ్డి, డా.అమిత్, బి వెంకటేష్‌గౌడ్, పోశెట్టిగౌడ్, సురభి రమేష్‌రావు, విష్ణువర్ధన్ రెడ్డి, గోవర్ధన్, శ్రీశైలం, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలో నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠాపన మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, గౌతమ్ గౌడ్, ధాత్రి నాథ్ గౌడ్, యాదగిరి, జనార్దన్, మల్లేష్, మల్లేష్ యాదవ్, కృష్ణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై యువత బీజేపీలో చేరుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. ఆదివారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారానికి చెందిన యువకులు పార్టీలో చేరారు. అనంతరం బీజేపీ జెండాను ఎగరవేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు ఎంపిక

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్ చెందిన 5మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌ల కోసం అర్హత పరీక్షలు రాశారన్నారు. ఇందులో మణికర్ణిక, ఆశ్రిత, దీపక్‌కుమార్, కళ్యాణ్ కుమార్, శ్రద్ధ ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ప్రతి ఏటా రూ.12వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లు వస్తాయని తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



ఎమ్మెల్యేను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- రాజగోపురం నిర్మాణానికి రూ .27 లక్షల విరాళం అందజేత

పటాన్‌చెరు: దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని జీవి గుట్ట కాలనీలో నూతనంగా నిర్మించిన రాధాకృష్ణ ఆలయం రాజగోపురం నిర్మాణానికి రూ .27 లక్షలు భారీ విరాళం అందించారు. ఆదివారం ఉదయం ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఆలయాలకు ఎల్లవేళలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ప్రతినిధులు సన్మానించారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ కౌన్సిలర్ బాశెట్టి కృష్ణ, నరసింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీరప్ప బోనాలు



మల్కారంలో బోనాల ఊరేగింపు

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారంలో బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బీరప్ప బోనాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు..పోతురాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

పనిచేస్తున్న ఇంటికే కన్నం..

- బంగారు ఆభరణాలు దొంగిలించిన మహిళ అరెస్ట్
- 90 గ్రాముల బంగారం, 77 గ్రాముల వెండి స్వాధీనం



మియాపూర్: ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించిన పనిమనిషిని మియాపూర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. డీఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం చండకాంపల్లికి చెందిన భయమ్మ అలియాస్ లక్ష్మీ(40) మియాపూర్ ఆల్విన్ కాలనీలో నివాసముంటుంది. మియాపూర్ మదీనాగూడ మైత్రినగర్ కాలనీ ఫేస్-2లోని కృష్ణకార్తీక్ ఇంట్లో గత పది సంవత్సరాలుగా పనిచేస్తుంది. అదేవిధంగా చుట్టుప్రక్కల ఇళ్లల్లో కూడా పనులు చేస్తోంది. రోజు మాదిరిగానే పనికి వచ్చిన లక్ష్మి కృష్ణకాంత్ లేని సమయం చూసి ఇంట్లో ఉన్న బీరువా తెరిచి అందులో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లింది. నారాయణఖేడ్‌లోని ఓ జువెలరీ షాప్‌లో విక్రయించేందుకు వెళ్లగా షాపు యజమాని అనుమానంతో అక్కడ పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకుని లక్ష్మీని విచారించి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. కాగా కృష్ణకాంత్‌కు మియాపూర్ పోలీసులు సమాచారం అందించడంతో కృష్ణ కాంత్ ఇంట్లో బీరువాను తెరిచి చూడగా నగలు కనిపించలేదు. వెంటనే మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పనిమనిషి లక్ష్మీని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకుంది. ఆమె వద్దనుండి 90 గ్రాముల బంగారు నగలు, 77 గ్రాముల వెండి ఆభరణాలను మియాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీపై కేసు నమోదు చేసుకుని అరెస్ట్ చేశారు. గతంలో కూడా ఆమె పనిచేసే ఇళ్లల్లో చిన్న చిన్న వస్తువులు దొంగతనానికి పాల్పడుతూ పట్టుబడగా యజమానులు మందలించే వారని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి



మియాపూర్: ఇంటిముందు ఆడుకుంటూ బాలుడు ప్రమాదవశాత్తు సంపులో పడిపోగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల... ప్రకాశం జిల్లాకు చెందిన కుంచాల కళ్యాణ్, జ్యోతిలు కుటుంబ సభ్యులతో కలిసి మియాపూర్‌లోని స్టాలిన్ నగర్ కాలనీలో ఉంటున్నారు. వ్యాపారి కళ్యాణ్, జ్యోతి దంపతులకు కె. ప్రణీత్ కుమార్(రెండున్నర సంవత్సరాలు) ఉన్నాడు. ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రణీత్ ఇంటిముందు ఆడుకుంటూ ఉన్నాడు. 3 గంటలకు కళ్యాణ్, బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుప్రక్కల వెతికి ఇంటి ముందు ఉన్న సంపులో చూడగా ప్రణీత్ సంపులో పడి ఉన్నాడు. వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి కళ్యాణ్ ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పది ఫెయిలైన వారికి స్పెషల్ క్లాస్‌లు..

స్పందన కరువు



బంజారాహిల్స్ రోడ్‌నం.12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

బంజారాహిల్స్: పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు వారం క్రితం ఆదేశాలు జారీ చేయడమే కాకుండా తగిన ప్రణాళికలు సైతం విడుదల చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సబ్జెక్టు టీచర్లు యోచిస్తుండగా విద్యార్థుల నుంచి ఆదరణ కరువవుతోంది. జూన్ 3వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ప్రస్తుతం శిక్షణలో ఉండగా ఇదే సమయంలో ప్రత్యేక తరగతులు కూడా తీసుకోవాలని ఆదేశాలు అందాయి.

17 పాఠశాలల్లో 175మంది ఫెయిల్..

విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇటీవల విడుదలైన పది పరీక్షా ఫలితాల్లో 1285 విద్యార్థులకు గాను 1110 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 90.5 శాతం ఉత్తీర్ణత ఈ జోన్ పరిధిలో నమోదైంది. 175 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఒక్కో పాఠశాలలో 10 నుంచి 12 మంది విద్యార్థులు ఒకట్రెండు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు.

స్కూళ్లకు తాళాలు..

సబ్జెక్టు టీచర్లు ఫెయిలైన వారికి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. అయితే సబ్జెక్టుకు ఒకరు, ఇద్దరు మాత్రమే ఫెయిల్ కాగా వారిని క్లాస్‌లకు రమ్మని పిలిస్తే స్పందించడం లేదు. దీంతో పాఠశాలలకు తాళాలు పడుతున్నాయి. ఫెయిలైన విద్యార్థులందరూ పాసయ్యేలా చూసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉండగా విద్యార్థులు మాత్రం స్పందించడం లేదు.

- ఫెయిలైన విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా కార్యాచరణ రూపొందించాలని కొంతమంది తల్లిదండ్రులు కోరుతుండగా.. ఆ మేరకు ప్రణాళికలు రూపొందించినా విద్యార్థులు రావడం లేదు. ఏ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాడో ఆ విద్యార్థిని సంబంధిత ఉపాధ్యాయుడితో కో-ఆర్డినేట్ చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రత్యక్ష తరగతులకు విద్యార్థులు గైర్హాజరవడం గమనార్హం. కనీసం ఆన్‌లైన్ తరగతులైనా వినాలని అవగాహన కలిగిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

టీచర్లు వచ్చినా రాని విద్యార్థులు

- సప్లిమెంటరీలో ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక చర్యలు
- అందరికీ కలిపి ఒకేచోట క్లాస్‌లు నిర్వహించాలంటున్న తల్లిదండ్రులు

ఒకే చోట తరగతులు నిర్వహిస్తే బాగుండేది..

ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి పాఠశాల నుంచి 10-12 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. చాలా పాఠశాలల్లో ఒక్కో సబ్జెక్టుకు ఒకరిద్దరు మాత్రమే ఫెయిలయ్యారు. ఒక్క విద్యార్థికి ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి పాఠశాలలకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులు రావాల్సి వస్తుంది. అలా కాకుండా ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఒకే పాఠశాలలో ప్రత్యేక తరగతులు ఏర్పాటుచేసి జోన్ పరిధిలో ఒక సబ్జెక్టులో ఫెయిలైన విద్యార్థులందరినీ ఆ పాఠశాలకు రప్పించి ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో టీచర్‌ను కేటాయించి బోధిస్తే బాగుండేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

పరీక్షలకు మరో 15రోజులే...

- మరో 15 రోజులు సమయం ఉన్న నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ దిశగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అన్ని పాఠశాలలకు కలిపి సైన్స్‌లో 30 మంది ఫెయిల్ కాగా, ఈ 30 మందిని ఒక పాఠశాలకు పంపించి అక్కడ తరగతులు నిర్వహించి ఉంటే బాగుంటుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.